రాధ బక్కెట్లు మోసుకుంటూ వెళ్ళి దభీ మని బాత్‌రూంలో పెట్టింది. బాత్‌రూం అంటె నున్నటి మొజైక్ గచ్చుతో, రయ్యీమని విసురుగా వచ్చే వేణ్ణీళ్ళ కుళాయితో, నునువెచ్చని జల్లులు కురిపించే షవర్‌తో, తెల్లని నున్నటి బాత్ టబ్‌తో, అంగ చందాల్ని అనుక్షణం తెలిపే అద్దాలతో వున్న బాత్‌రూంకాదు పక్కింటి హద్దు గోడ నుంచి రెండు ఒంటిటుక గోడలు లాగి, ఒకరేకు తలుపు బిగించి, దాన్నే బాత్‌రూం అన్నారు. తలుపుకి రెండు వైపులా వెరిసెలు వుండి, లోపలి మనుషులు బయటకి కనిపించే ప్రమాదం కూడా వుంది అయితే పక్కింటి గోడ కాంపౌండు గోడకాదు వాళ్ళ వంట యింటి గోడే దీని హద్దు. ఆ గోడకి పైగా ఒక కిటికీ వుంది. అది ఇవతలి బాత్‌రూంలోకి కనిపిస్తుంది. కాని పక్కిల్లు లోతుగా వుండటం వల్ల యిక్కడి మనుషులు పక్కింట్లోకి కనిపించరుగాని వాళ్ళ గదిలో ఎత్తుగా కట్టిన వెదురు బొంగుమీద మాసిన బట్టలు, వేలాడే కూరల బుట్టలూ వీళకి కనిపిస్తాయి.



# శ్రమ్య కాటిక

ఇంద్రగంటి జానకీబాల

రాధ రేకు తలుపు గట్టిగా లాగి గోడకి కట్టిన మేకుకి తాడుముడేసి రెండు వైపులా ఎవరూ కనిపించకుండా చీరా, పరికిణీ రేకు మీద వేసి సర్దేసి—

'ఆరేసు కోబోయి' అంటూ గట్టిగా మొదలెట్టింది వేణ్ణీళ్ళు ముఖంమీద చిలకరించుకుంటూ "హరి-హరి-హరి" అంటోంది.

ఇంతలో పక్కింటోంచి గలగల గిన్నెలు దొర్లిపోయే శబ్దాలు రాధ చెవుల్ని బద్దలు కొట్టేశాయి. అది కె. వి. మహదేవన్ మ్యూజిక్ కానేకాదు. తప్పకుండా ఆర్. డి. బర్మన్‌దే. రాధ పాట ఆపేసింది. ఏమిటి చెప్మా అంతచప్పుడు అనుకుంటూ నిశ్శబ్దంగా వుండి పోయింది.

"అబ్బబ్బ పాడుసంతా, పాడుయిల్లూ, తోమి పెట్టుకున్న సామాన్లన్నీ దొల్లించేసింది. అసలే ఓపికలేక ఇస్తున్నా చేసిందే చెయ్యాలంటే నావల్ల కాదు. కాస్త పిల్లని తీసేవాళ్ళైనా లేరు ఊ...ఊ. ఎంత ఓపిక లేకుండా వున్నా, అన్నీ నేనే చావాలి ఒక్కళ్ళకీ పట్టదు." బరువుగా, ఆయాసంగా ఆ యిల్లాలి బాధా దృశ్యం వినిపిస్తోంది

"ఏయ్ నీకే అతితెలివి చూపించకు. అంత ఓపిక లేకపోతే ఓ చోటపడుండు. ఎవరుచెయ్యమన్నారు?" గండ్రగా, బిరగ వున్న అతని కంఠం వింటుంటే రాత్రంతా తాగాడా అనిపిస్తోంది.

"మీకేం, కబుర్లు బాగానే చెప్తారు మా యింటికి పంపేయండి అంటే వినిపించుకోరు. ఏం? నాలుగు రోజులు నా పుట్టింట్లో నేను సుఖంగా వుంటే మీకేమిటి బాధ?"

"బాధాలేదు ఏమీకాదు. ఇప్పుడి నుంచే వెళ్ళి పుట్టింట్లో ఏంచేస్తావు" అంటూ గొంతు తగ్గించి "ఇంకా ఎనిమిదేగా" అండా బిర కంఠం.

"వాల్లెండి. కూర్చోలేక, నడవలేక, పనిచేసుకోలేక ఛస్తుంటే మా యింటికి పంపటానికి మనసు రాదుగాని, ప్రేమ ఒలకబోస్తున్నారు—ప్రేమ—ఊ... వద్దొద లెండి.

"అదే వద్దన్నా- మా అమ్మ వుందిగా అవిడేచేస్తుంది పని. నువ్వు కూర్చో"

"ఆ... కూర్చోకే? అవిడ బాగానే చేస్తుంది. మీ అమ్మ మరీ చేస్తుంది. సుఖపడలేక పోతున్నా పాపం—"

"అబ్బ, కోపంలో నీ ముఖం మరీ అందంగా వుంది."

"నన్ను వదులుతారా— లేదా. ఎవరేనా చూస్తే ప్రాణం చచ్చిపోతుంది."

"ఎందుకూ— నేనేగా."

"అయితే?"

"వాళ్ళూ కాస్త వుత్సాహపడి, పెళ్ళాన్ని సుఖపెట్టడం ఎలాగో నేర్చుకుంటారు."

"మరే పాపం! అదిగో పంటిపిల్ల వచ్చేసింది. అబ్బ! వదలండి-"దుర్మంతీసున్న" నోటిమీద మూతబడినటు మూలుగు.

రాధ గబగబ రెండు చెంబుల నీళ్ళు పంటిమీద పోసేసుకుంది. అవి వేడినీళ్ళే అయినా చల్లబడి పోయాయి.

"అమ్మా ఏజా పేసలు, (అయిదు పైసలు) ఏజా పేసలు" అంటూ రాగం అందుకుంది పంటిపిల్ల మూడేళ్ళో, నాలుగేళ్ళో చెప్పడం కష్టం. వినిపించేదృశ్యంలో వివరణ దొరకడం లేదు.

ఇదిగో, దీనికో అయిదు పైసలిచ్చి పంపించి, యిటురండి, కుంపటిమీద కాఫీ పెట్టా, లాగేసి వెళ్ళండి"

"ఓ తప్పకుండా"

"ఈ విషయాలన్నీ ఎవరికి తెలీవుకనుక? నన్ను మా యింటికి పంపేయండి" గారంగా వుందా భార్య గొంతు.

"అమ్మో నువ్వు లేకపోతే నే బ్రతకగలనా."

"ఓ యబ్బో, నే నెందుకు? రాత్రంతా తాగి తందనాలాడి యింటికొస్తే తలుపు మీ అమ్మ అయినా తీస్తుంది." చెప్పి పొడిచింది.

"అదే వద్దన్నా నువ్వులేకపోతే... ఓహో ఈ ప్రాణం."

"అబ్బ! ఏమిటీ మోటు సరసం, రాత్రంతా నడుం పోటుతో క్షణం నిద్ర లేదు."

"ఎక్కడ? నే చూడనా"

"ఛీ ఛీ ఏమిటీ పాడుగోల, మీ అమ్మ వచ్చేస్తారు. కృష్ణకి స్నానానికి వెళ్ళి గంటపైనే అయ్యింది."

"వస్తే రానీ"

"పాపం! తెల్లారేక గుర్తుకొచ్చింది పెళ్ళాం! అంత మోజున్న వారైతే రాత్రి యింటికి రాకపోయారా- హు..."

"ఉష్ మాట్లాడకు"

"ఏమే, ఈ పిల్ల వీధినబడి పోతుంటే చూసుకోవడం అదీ ఏమీ లేదా"! అంటూ గియ్యిన డీసెల్ యింజన్ కూత లాంటి కంఠం వినిపించింది

రాధ వులిక్కి పడింది.

"రాధా నువ్వా బాత్‌రూంలోంచి బయటకొస్తావా, రానా. నాకీవేళ ఆఫీసు యోగం లేదేమిటి" అంటూ అరిచిన అన్నగారి కేక విని తువ్వాలందుకుని తెల్లని గుండెల మధ్య ముత్యాల్లా అక్కడక్కడ నిలచిన నీటి చుక్కల్ని వొత్తుకుని, పరికిణీ చీరా అందుకుంది రాధ.

